www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 11 డిసెంబర్ 2023
5
వైఎస్ఆర్



కవులకు స్వాగతం

ప్రజాశక్తి - కడప అర్బన్

వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 23, 24 తేదీల్లో జిల్లా పరిషత్ సభా భవనంలో నిర్వహిస్తున్న రెండు రోజుల మహాసభల్లో కవులందరూ పాల్గొనాలని జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సుదీర్ఘ కాలం తర్వాత జిల్లాలో మహాసభలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మన జిల్లా వైభవాన్ని చాటిచెబుతూ కవిత చెప్పాలని, కవి సమ్మేళనంలో పాల్గొనే ప్రతి కవి ముందుగా వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘంలో రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకోవాలని తెలిపారు. రెండు రోజులు జరిగే సభల్లో పాల్గొని సభలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. కవి సమ్మేళనంలో పాల్గొనే కవులకు శాలువ, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో పెద్దల సమక్షంలో సత్కరిస్తామని తెలిపారు. సంఘంలో సభ్యత్వం తీసుకొనేవారు సంఘం ప్రధాన కార్యదర్శి జింకా. సుబ్రమణ్యం 9704651414, కోశాధికారి డాక్టర్ కొపోల్లు రెడ్డి శేఖర రెడ్డి 9032595101లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

తెలుగు సాహిత్య విమర్శకులు 'కట్టమంచి'

ప్రజాశక్తి - కడప అర్బన్

పింగళి సూరన కళాపూర్ణోదయంపై 'కవిత్వతత్వ విచారం' అనే తొలి విమర్శ గ్రంథాన్ని రచించిన డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డి తెలుగు సాహిత్య విమర్శకు ఆద్యులని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సి.కె.సంపత్ కుమార్ పఠన మందిరంలో ఆదివారం ఉదయం బహుముఖ ప్రతిభాశాలి కట్టమంచి రామలింగారెడ్డి 144వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. గజ్జెల అశోక్ కుమార్ రెడ్డి, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు కలసి కట్టమంచి చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య టి.రామప్రసాద రెడ్డి మాట్లాడుతూ సాహితీవేత్తగా, పాలనాదక్షుడుగా, రాజకీయవేత్తగా, గొప్పవక్తగా రాణించిన బహుముఖ ప్రతిభాశాలి అన్నారు. సి.పి.బ్రౌన్ రచించిన 'హండే అనంతపురం' చరిత్ర ఆధారం చేసుకొని 'ముసలమ్మ మరణం' కావ్యాన్ని రచించారని పేర్కొన్నారు.సాహిత్య చరిత్రలో తొలి ఆధునిక కావ్యంగా స్థానం సంపాదించుకుందన్నారు. చిత్తూరు జిల్లా కట్టమంచి గ్రామంలో జన్మించడం వల్ల ఆ పేరుతోనే ప్రసిద్ధులయ్యారన్నారు. గజ్జెల అశోక్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కట్టమంచి ఆంధ్రవిశ్వవిద్యాలయానికి తొలి ఉపాధ్యక్షులుగా పనిచేసి ఉన్నతవిద్యలో అనేక సంస్కరణలను తీసుకువచ్చారన్నారు. గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉప్పు సత్యాగ్రహ సందర్భంలో దానికి మద్దతుగా కట్టమంచి విశ్వవిద్యాలయ ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేశారన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ కట్టమంచి చెన్నైలో చదువుకుంటున్నప్పుడు ముసలమ్మ మరణాన్ని రచించారని, దానికి ఆంధ్ర భాషాభిరంజని వారి బహుమతి లభించిందన్నారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథపాలకులు జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకట రమణ, సిబ్బంది రాణి, అరుణ, లక్ష్మన్న, పాఠకులు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



'కట్టమంచి' చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రామప్రసాద్‌రెడ్డి

జగన్ పాలనతో రాష్ట్రం సర్వనాశనం

న్యాయవాదుల ఆత్మీయ సమావేశంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి కుమారుడుగా జగన్మోహన్ రెడ్డి ప్రజా రంజక పాలన చేస్తారని ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే, పరిపాలన అవగాహన రాహిత్యంతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. జియాన్ వ్యాయామ కళాశాలలో ఆదివారం టిడిపి న్యాయవిభాగం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఎస్ మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయవాదుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే, ప్రతిపక్షాలను లేకుండా చేయాలని, టిడిపి నాయకులను అక్రమ అరెస్టులతో జైళ్లకు పంపుతున్నారని పేర్కొన్నారు. టిడిపి హయాంలో స్కిల్ డెవలప్మెంట్‌లో అవినీతి జరిగిందని టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబును అక్రమ అరెస్టుతో జైలుకు పంపితే, న్యాయస్థానాల్లో వైసిపి ప్రభుత్వ దుర్మార్గాన్ని న్యాయవాదులు తిప్పి కొట్టారని చెప్పారు. రాజ్యాంగాన్ని అమలు పరిచే వారే న్యాయ వాదులని, ధర్మం, న్యాయం ఉండబట్టే చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటకు వచ్చారన్నారు. ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్ల చెల్లింపులకు గతిలేక, అప్పులు చేసే దౌర్భాగ్య స్థితికి రాష్ట్రాన్ని ఈ ప్రభుత్వం తీసుకు వచ్చిందని విమర్శించారు. ఒకపక్క కరువు, మరో పక్క తుపాన్ వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకునే పరిస్థితుల్లో ప్రభుత్వం లేదన్నారు. ముందస్తుగా తుపసాన్ పరిస్థితులను ఎదుర్కొనే పరిజ్ఞానం కూడా ఈ ప్రభుత్వానికి లేదని ఆరోపించారు. రాష్ట్ర విభజనతో రూ.16 వేల కోట్ల లోటు బడ్జెట్లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు లోటును అధిగమించి, రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు చేయించారని ఆయన చెప్పారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుంటేనే రాష్ట్రం బాగుపడుతుందన్నారు. ప్రతి ఒక్క న్యాయవాది టిడిపి గెలుపునకు రెడ్డప్ప గారి మాధవికి విజయం చేకూర్చాలని ఆయన న్యాయవాదులను కోరారు. కడప నియోజకవర్గ టిడిపి ఇన్చార్జిరెడ్డప్ప గారి మాధవి మాట్లాడుతూ టిడిపి హయాంలో, ఇప్పటి వైసిపిలో కుటుంబ ఆర్థిక పరిస్థితికి ఎంతో వ్యత్యాసం ఉందని చెప్పారు. వైసిపి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, రకరకాల పన్నుల భారాన్ని ప్రజల పై పెనుబారం మోపిందని తెలిపారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలని, చంద్రబాబు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, సబ్సిడీ రుణాలు అందివ్వడంతోపాటు, నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించారని ఆమె గుర్తు చేశారు. విదేశీ విద్యకు ఆర్థిక సాయం అందించిన ఘనత చంద్రబాబుదే అన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశం సంక్షేమ పథకాలు నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. ఒక్క రోడ్డు సౌకర్యంగా లేదని, కనీసం డ్రెయినేజీ లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని వాపోయారు. బాధ్యతారహితంగా పాలకులు వ్యవహరిస్తే, ఇంటికి సాగనంపడం ఖాయమని ఆమె హెచ్చరించారు. ముందుగా అక్కడికి చేరుకున్న శ్రీనివాసరెడ్డి, మాధవికి ఘనస్వాగతం పలికి, దృశ్యాలు వా కప్పి పూలమాలలు వేసి న్యాయవాదులు సత్కరించారు. ఆత్మీయ సమావేశంలో మాజీ జిపి గుర్రప్ప, శివ శంకర్ రెడ్డి, జింక సుబ్బరాయుడు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

'అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు'

ప్రజాశక్తి - చెన్నూరు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి

రాష్ట్రంలోని ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాలకు సంక్షేమ పథకాలు అందేలా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి కృషి చేశారని మంత్రులు అంజద్‌బాష, కార్మూరు నాగేశ్వరరావు, మెరుగు నాగార్జున, ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ అవినాష్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొండపాట పెన్నా బ్రిడ్జి వంతెనపై సామాజిక బస్సుయాత్రలో భాగంగా నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా బడుగు బలహీన వర్గాలకు జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అందించారని వారన్నారు. మహిళలకు వైఎస్ఆర్ చేయూత, జగనన్న విద్యా జీవన, జగన్ అన్న విద్యా వసతి, రైతులకు పావలా వడ్డీ, మహిళలకు డ్వాక్రా రుణమాఫీ, అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని వారన్నారు. కార్యక్రమంలో స్థానిక కర్నూలు మాజీ పార్లమెంటు సభ్యులు బుట్టా రేణుక, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, సీకే దిన్నె జెడ్పిటిసి నరేన్ రామానుజన్ రెడ్డి, అఫ్జల్ ఖాన్, పులి సునీల్ కుమార్, అధికార ప్రతినిధి గుమ్మ రాజేంద్రప్రసాద్ రెడ్డి, స్థానిక నేతలు ఎంపిపి చిర్ల సురేష్ యాదవ్, మండల కన్వీనర్జియన్ భాస్కర్ రెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ అల్లి శ్రీరామ్ మూర్తి, పార్టీ నాయకులు మహమ్మద్ రబ్, అన్వర్ బాష, మధు రెడ్డి సుబ్బారెడ్డి, రఘురాం రెడ్డి, ఆర్ వి ఎస్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చిన్న, టీఎన్ చంద్రారెడ్డి పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

జిల్లాస్థాయి చెస్ టోర్నీ విజేత వినీల్ సాయిరెడ్డి

ప్రజాశక్తి - కడప



విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేస్తున్న రెడ్డి పవన్

జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కడప నగరంలోని మస్తాన్‌వల్లి వీధిలో గల హాల్ ఆఫ్ చెస్‌లో నిర్వహించిన కులాయప్ప మెమోరియల్ జిల్లాస్థాయి ఓపెన్ ప్రైజ్ మనీ జస్ట్ టోర్నమెంట్ విజేతగా రేటెడ్ క్రీడాకారుడు వినీల సాయి రెడ్డి నిలిచాడు. ఈ టోర్నమెంట్‌లో జిల్లా నలు మూలల నుంచి 58 మంది చెస్ క్రీడాకారులు హాజరాయ్యరు. టోర్న మెంటులో ఐదు రౌండ్లకు గాను ఐదు పాయింట్లు సాధించిన రేటెడ్ క్రీడా కారుడు వినీల్ సాయి రెడ్డి విజేతగా నిలిచాడు. రెండవ స్థానాన్ని మరో రేటెడ్ క్రీడాకారుడు ప్రభుదేవా, మూడవ స్థానాన్ని మరో రెండేడ్ క్రీడాకారుడు శ్రీకాంత్, నాలుగో స్థానాన్ని రేటెడ్ క్రీడాకారు నజీర్‌బాష నిలిచారు. ఐదవ స్థా నాన్ని పృథ్వీరాజ్ సాధించినాడు. ఆరవ స్థానం మహిధర్, ఏడవ స్థానం జస్వం త్, ఎనిమిదవ స్థానం దేవేంద్ర నాథ్ రెడ్డి, 9వ స్థానం జతిన్ కుమార్, పదవ స్థానం చిన్మయి సాధించినారు. విజేతలకు బహుమతులను స్పాన్సర్, చదరంగం క్రీడాకారుడు, ప్రొద్దుటూరుకు చెందిన రెడ్డిపవన్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్ దర్బారి, చీఫ్ ఆర్బిటర్ ప్రొద్దుటూరుకు చెందిన ముజంమిల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి యువనేత రితీష్‌రెడ్డి

అధికారంలోకొస్తే అభివృద్ధి చేస్తాం

తెలుగుదేశం పార్టీ యువనేత రితీష్‌రెడ్డి

ప్రజాశక్తి-కాశినాయన


బద్వేల్ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, ఆమె కుమారుడు రితీష్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర ఆదివారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గురివిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, ఎం. కృష్ణారెడ్డి, పోలిరెడ్డి నియోజవర్గంలోని నాయకులు అందరూ తరలివచ్చారు. ఇదీలా ఉండగా మండలంలో టిడిపి పాదయాత్రలో కీ.శే. కర్నాటి శివారెడ్డి కుమారుడు వెంకటరెడ్డి తెలుగుదేశం పార్టీ కడప మాజీ పార్లమెంటు అధ్యక్షురాలు శ్వేతా రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరు కాకపోవడం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. దీంతో అసమ్మతి సెగ బట్టబయలు అయినట్లు పలువురు విమర్శించుకుంటున్నారు.

12న సిపి బ్రౌన్ 140వ వర్ధంతి సభ

కడప అర్బన్ : 'తెలుగు సూర్యుడు' సి.పి.బ్రౌన్ 140వ వర్ధంతి సభను ఈనెల 12న ఉదయం 10.00 గంటలకు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు సంచాలకులు ఆచార్య టి.రామప్రసాద రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9:40 నుంచి రాజీవ్ మార్గ్‌లోని సి.పి.బ్రౌన్ విగ్రహానికి పూలమాలాలంకరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సభాధ్యక్షులుగా తొలి ముస్లింవాద రచయిత, పూర్వ శాసనమండలి సభ్యులు, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు షేక్.హుస్సేన్ సత్యాగ్ని, ముఖ్యఅతిథిగా విసి ఆచార్య చింతా సుధాకర్, విశిష్ట అతిథిగా యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య హాజరవుతారన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం

ప్రజాశక్తి - కడప



కార్యక్రమానికి హాజరైన పూర్వ విద్యార్థులు

కడప పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి) లో పూర్వ విద్యార్థుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దాదా పు140 మంది పూర్వ విద్యార్థులు హాజరై తమ విలువైన అభిప్రాయాలను, అనుభూతులను తోటి విద్యార్థులతో పంచుకున్నారు. వజ్రోత్సవాల వేల కళాశాల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందించాలని సమావేశానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి రవీంద్రనాథ్ పేర్కొన్నారు. కొంతమంది పూర్వ విద్యార్థులు నగదు రూపంలో విరాళాలను ప్రకటించారు. సిపిడిసి సభ్యులు చిన్నపరెడ్డి, పోతుల వెంకటరామిరెడ్డి, పూర్వ విద్యార్థుల సంఘం తరపున శివరాం, ప్రిన్సిపల్ రవి కుమార్, గునిశెట్టి శ్రీనివాసులు, నాగరాజు రామకృష్ణ, కృష్ణవేణి, లీలావర్ధిని, రాజశేఖర్, గురుమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోవాలి

- ఎన్‌సిఎస్‌పి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్లకు శ్రీకారం
- ప్రతి నెలా జాబ్‌మేళాలు నిర్వహిస్తాం
- మోడల్ కెరీర్ సెంటర్లతో నిరుద్యోగులకు శిక్షణ
- జిల్లా ఉపాధి కల్పన అధికారి పి.సురేష్‌కుమార్ వెల్లడి

జాబ్‌మేళాల ద్వారా ఉపాధి అవకాశాలను ఒడిసి పట్టుకోవాలి. జిల్లా ఉపాధి కార్యాలయం రిజిస్ట్రేషన్ల నమోదును ఆఫ్‌లైన్ నుంచి ఎన్‌సిఎస్‌పి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లోకి మారనుంది. దేశంలోని ప్రయివేటు కంపెనీల సంబంధించిన ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. దేశంలోని ఏ ప్రాంతాల్లో జాబ్‌మేళాలు, రిక్రూట్‌మెంట్లలోని అవకాశాలను దక్కించుకునే అవకాశం ఉంది. దీనికితోడు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన స్కిల్‌హబ్ ద్వారా సాఫ్ట్ వేర్ ఉద్యోగ అవకాశాలకు శిక్షణ ఇవ్వడం దగ్గర నుంచి ఇతర పారి శ్రామిక అవసరాలకు అవసరమైన రీతుల్లో శిక్షణ ఇచ్చే అవకాశాలు అందుబాటులోకి రాబోతున్నాయని, ఇందులో శిక్షణ ఇవ్వడానికి టిసిఎస్ వంటి సంస్థలకు చెందిన నిపుణులు సహాయం తీసుకునే ఆలోచన ఉందని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.సురేష్‌కుమార్ పేర్కొన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో మరిన్ని వివరాలు ఆయన వెల్లడించారు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



ముఖా ముఖి..

జిల్లాలోని నిరుద్యోగుల వివరాలను తెలపండి?

జిల్లాలో సుమారు 51, 211 మంది నిరుద్యోగులు ఉన్నారు. వీరిలో పురుషులు 35,751 మంది, మహిళలు 15,450 మంది ఉన్నారు.

రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియ గురించి చెప్పండి?

గతంలో ఆఫ్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ నిర్వహించడం తెలిసిందే. కేంద్రప్రభుత్వ పరిధిలోని నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టాం. పోర్టల్‌లో పేర్లు నమోదు చేసిన మూడు నెలల అనంతరం రిజిస్ట్రేషన్ అవుతుందని గమనించాలి.

ప్రభుత్వ ఉద్యోగాలు కొరవడిన నేపథ్యంలో జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం పాత్ర ఏమిటి?

ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగాలను 1:20 శాతం ప్రకారం చాలా తక్కువ సంఖ్యలో ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయ సిఫారసు చేయడం జరిగినమాట వాస్తవమే. మారిన పరిస్థితుల నేపథ్యంలో పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం మెగా, మినీ జాబ్‌మేళాలాల ద్వారా ప్రయివేటు రంగంలో అందివచ్చిన అవకాశాలను నిరుద్యోగులను సిఫారసు చేస్తు న్నాం.

జాబ్‌మేళాల ద్వారా ఎంతమందికి ఉపాధి అవకాశాలను కల్పించారు?

జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, ఎపిఎస్‌డిసి, సి.టాప్ సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో 2022 జనవరి నుంచి మెగా, మినీ జాబ్ మేళాలు నిర్వహిస్తున్నాం. ప్రతినెలా మొదటి శుక్రవారం, మూడవ మంగళవారం జాబ్‌మేళాలు నిర్వహించడం జరుగుతోంది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల వారీగా రొటేషన్ పద్ధతిలో నిర్వహిస్తున్నాం. ఇప్పటివరకు జనవరి నుంచి డిసెంబర్ (నేటి) వరకు 30 జాబ్‌మేళాలను నిర్వహించడం ద్వారా వేలాది మందికి ప్లేస్‌మెంట్స్ ఇప్పించడం జరిగింది.

మోడల్ కెరీర్ సెంటర్ల ఉపయోగాలేమిటి?

టెన్త్, ఇంటర్ ఉత్తీర్ణులు కెరీర్‌ను ఎంపిక చేసుకోవడంలోని గందరగోళానికి గురవడం తెలిసిందే. కేంద్రం ఫేస్-1, 2, 3 దశల వారీగా ఆయా మోడల్ కెరీర్ సెంటర్ల ఏర్పాటుకు సంబంధించి జిల్లాలను ఎంపిక చేస్తోంది. ఇందులోభాగంగా కడప జిల్లా ఫేజ్-3 కేటగిరీ కిందకి వచ్చింది. జిల్లాలోని ఉపాధి కల్పనా కార్యాలయంలో ఐటి ల్యాబ్, శిక్షణార్థులకు గ్రూప్ డిస్కస్ గదులను ఏర్పాటు చేయ డం జరుగుతోంది. ఈలెక్కన మొత్తంగా నిరుద్యోగులను పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇవ్వడానికి ఉపయోగపడుతుంది.

స్కిల్‌హబ్స్ ఏర్పాట్ల గురించి తెలపండి?

జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పనా కార్యాలయంలో రూ.30 లక్షలతో అత్యాధునిక స్కిల్‌హబ్‌ను ఏర్పాటు చేశాం. ఇందులో అత్యాధునిక సాంకేతికను ఉపయోగించుకుని శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తాం. దేశంలోని ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలైన టిసిఎస్ వంటి కంపెనీ నుంచి సాంకేతిక నిపుణుల సహాయంతో శిక్షణ ఇస్తాం.

స్కిల్‌హబ్ కళాశాల ఏర్పాటు ఎప్పుడో?

ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో స్కిల్‌హబ్ కళాశాలను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా కోర్సులను రూపకల్పన చేస్తాం. మెకానికల్, డిప్లమో తదితర ఆధునిక కోర్సుల శిక్షణార్థులను పారిశ్రామిక సంస్థలతో అనుసంధానం చేస్తాం. ఫలితంగా ఉపాధి కల్పనా కార్యాలయం ద్వారా మరింత మందికి ఉపాధి అవకాశాలు చేరువ అవుతాయని చెప్పవచ్చు.

మానవ హక్కులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి -బద్వేలు

ప్రతి ఒక్కరికీ మానవ హక్కులు, వాటి ప్రాముఖ్యపై అవగాహన అవసరమని ఎపి కన్జ్యూమర్ అండ్ హ్యుమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు జి. శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం పట్టణం లోని సిద్ధవటం రోడ్డులో ఉన్న మానవ హక్కుల పరిరక్షణ కేంద్ర కార్యాలయంలో ప్రపంచ మానవహక్కుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కడప, అన్నమయ్య జిల్లా ఎస్‌సి కార్పొరేషన్ ఇడి డాక్టర్ హెచ్. వెంకటసుబ్బయ్య హాజరై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలను వేశారు. ఈ సందర్భంగా ఇడి మాట్లాడుతూ ఇక్కడ అన్ని సంఘాలతో కలిపి అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం జరుపుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని అన్నారు. ప్రతి ఒక్కరు కూడా మానవ హక్కులు, పరిక్షణ గురించి తెలుసుకోవాలన్నారు. మీరంతా కలిసి ప్రతి మారుమూల ప్రాంతాలలోనూ, ప్రతి విద్య వ్యవస్థలోనూ, ప్రతి ఆరోగ్య వ్యవస్థలోనూ, ప్రతి రైతు, మహిళా సంఘాలతో కలిసి చట్టం పట్ల అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని చెప్పారు. కార్యక్రమంలో కడప జిల్లా వినియోగదారుల రక్షణ మండలి కార్యదర్శి బి. గురుమూర్తి, బద్వేల్ పట్టణ అంబేద్కర్ భవన అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బి .జకరయ్య , డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కార్యదర్శి జి నాగార్జున , బద్వేల్ పట్టణ దళిత సీనియర్ నాయకుడు ఆర్.ఓబయ్య , డిబిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్ చిన్నయ్య ,ఆంధ్రప్రదేశ్ కన్జ్యూమర్ అండ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం స్టేట్ కమిటీ నాయకులు, వై ఓబయ్య , కె.రాజు, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఎన్ చిరంజీవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాలగిరి శివ

కడప : ప్రతి ఒక్కరు మానవ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని అప్పుడే తమకు న్యాయం జరుగుతుందని, పోరాడేందుకు వీలు ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పాలగిరి శివ అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రూపనగుడి సిద్దయ్య, ఆలిండియా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ చీఫ్ అశోక్ కుమార్ రెడ్డి, మల్లికార్జున, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ఐక్యత, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం

తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం నాయకులు



2024 కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు, పెద్దలు

ప్రజాశక్తి-కడప సిటీ

తొగట క్షత్రియుల ఐక్యత, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆ సంఘం నాయకులు పేర్కొన్నారు. ఆదివారం సంఘం కడప నగర శాఖ ఆధ్వర్యంలో రాజంపేట రోడ్డులోని కనుమలోపల్లిలో ఉన్న 108 శివలింగాల మహాశివుని సన్నిధిలో నిర్వహించిన కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహించారు. కడప నగర శాఖ అధ్యక్షులు కళ్యా సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా నరసింహారావు, ప్రధాన కార్యదర్శి సుంకర రామచంద్రుడు కోశాధికారి టేకూరి సుదర్శన్, ఉమ్మడిశెట్టి సుబ్రహ్మణ్యం పల్లా బాల చౌడన్న, దొండ్ల వెంకటరమణ, డాక్టర్ బండారు శ్రీనివాసులు, బొలిశెట్టి వెంకటస్వామి కుల బాంధవులను సాదరంగా ఆహ్వానించారు. మహోత్సవంలో భాగంగా మహిళలు, చిన్నారులు, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూను ఆట, పాటలు ఉత్సాహంగా నిర్వహించారు. పాటల పాటల్లో గెలుపొందిన మహిళలకు, పిల్లలకు బాలు మొబైల్స్ అధినేత చారు సుబ్బరాయుడు చారు బాలకృష్ణ, వారిచే బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా 2024 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ముద్రించిన క్యాలెండర్‌ను కుల బాంధవుల సమక్షంలో ఆవిష్కరించారు. అనంతరం అత్యంత సుచిగా, రుచిగా తయారుచేసిన వనభోజనాన్ని కుల బంధువులు అరగించారు. కార్యక్రమంలో 21వ డివిజన్ కార్పొరేటర్ మోత్కూరు సుజాత , మోత్కూరు సుబ్బరాయుడు తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప జిల్లా అధ్యక్షులు బండారు సూర్యనారాయణ ప్రధాన కార్యదర్శి బందా శంకర్, ప్రొద్దుటూరు తొగటవీర క్షత్రియ ఉద్యోగులు మరియు వృత్తినిపునులసంఘం అధ్యక్షులు ఈడెం లక్ష్మీనారాయణ, గోవిందు నాగరాజు, సిఆర్ఐ సునీల్, సంగినాదం ఆంజనేయులు,గాలి పుల్లయ్య, బొమ్మి శెట్టి చంద్రశేఖర్, బండారు శ్రీనివాసులు, గంజికుంట రఘురామయ్య, కాల్వ వాగేష్, టేకూరి పుష్పంగద, పోలిశెట్టి రఘురామయ్య, పోలిశెట్టి రెడ్డయ్య, కొరకుటి సుబ్బరాయుడు వెలిగండ్ల సుబ్బరాయుడు గోవిందు వెంకటరమణ కుండా శ్రీనివాసులు, మహిళలు జమ్మలమడుగు, ప్రొద్దుటూరు రాజంపేట, బద్వేలు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

బలిజలు రాజకీయంగా ఎదగాలి

-ఎమ్మెల్సీ రామచంద్రయ్య

ప్రజాశక్తి - కడప అర్బన్

బలిజలు రాజకీయంగా ఎదగాలని ఎమ్మెల్సీ రామచంద్రయ్య పిలుపునిచ్చారు. ఆదివారం బలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయంగా ఎదిగే వారికి చేయూతనివ్వాలని చెప్పారు. నాయకత్వ లక్షణాలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. జనాభా ఉంటే సరిపోదని, క్రియాశీలకంగా పనిచేయాలని పేర్కొన్నారు. అధినాతన రాజకీయ పరిస్థితుల్లో నాయకత్వ లక్షణాలు ఎంతో అవసరమన్నారు. శ్రీకృష్ణదేవరాయలు ఏ యుద్ధంలో ఓడిపోలేదని గుర్తు చేశారు. సంఘటితంగా ఉండేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఎదుటివాడిని మన వైపు వచ్చేలా మనకి ఉండాలని చెప్పారు. సుగవాసి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అందరూ గర్వించేలా పనిచేస్తానని తెలిపారు. బాలిశెట్టి హరిప్రసాద్ మాట్లాడుతూ వనభోజన మహోత్సవానికి పెద్ద ఎత్తున హాజరైన బలిజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, ప్రసాద్, చెన్నం శెట్టి మురళి, చలపతి, సుబ్రహ్మణ్యం, రమణ, రామాంజనేయులు, సుంకర శ్రీనివాస్, ఆకుల చలపతి, టైలర్ ఈశ్వర్, పాలెం వంశీకృష్ణ, టిప్పర్ బాబు, అడ్వకేట్ భాగ్యశ్రీ, సంఘం నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామచంద్రయ్య



రోగులకు పరీక్షలు చేస్తున్న కిమ్స్ వైద్య సిబ్బంది

ఉచిత గుండె వైద్య శిబిరానికి అపూర్వ స్పందన

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. మానవత సేవా సంస్థ ఛైర్మన్ చక్రపాణిరెడ్డి, మానవతా సేవా సంస్థ మండల అధ్యక్షుడు బాలాజీ, మాజీ అధ్యక్షుడు కావలి కృష్ణతేజ నిర్వహించారు. వేంపల్లె, చక్రాయపేట వేముల, వీరపునాయునపల్లె మండలాల్లోని ప్రజలు చిత వైద్య శిబిరంలో గుండె పరీక్షలు చేయించుకున్నారు. 500 మంది వైద్య పరీక్షలను చేయించుకున్నట్లు చక్రపాణిరెడ్డి చెప్పారు. అనంతపురం పట్టణానికి చెందిన కిమ్స్ సవేరా హాస్పిటల్ సిబ్బంది సహకారంతో రోగులకు గుండె పరీక్షలు చేసినట్లు చెప్పారు. రోగులకు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మానవత సేవా సంస్థ సభ్యులు రిటైర్డ్ లెక్చరర్ రామమునిరెడ్డి, బలిజ సంఘం మాజీ అధ్యక్షుడు రంగయ్య, మానవతా సభ్యులు, కిమ్స్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది, శ్రీచైతన్య విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి గెలుపునకు కృషి చేద్దాం

టిడిపి యువనేత బొల్లపు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



భూపేష్‌రెడ్డితో బొల్లపు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

జమ్మలమడుగులో టిడిపి గెలుపు కోసం ప్రతి ఒక్క కార్యకర్త కలిసి కృషి చేద్దామని బొల్లపు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ ఒక టిడిపి యువ నేతగా కంటే భూపేష్‌రెడ్డికి తాను మంచి మిత్రుడ్ని అన్నారు. భూపేష్‌రెడ్డి ముందుచూపుగల వాడన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీతో ప్రతి ఒక్క కుటుంబానికి అండగా ఉంటామని, నియోజక వర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి భరోసా ఇస్తూ హామీ పత్రాలను అందిస్తున్నారని తెలిపారు. పట్టణంలోని ఆరవ వార్డు నాగలకట్టలో తాము భూపేష్‌తో కలిసి ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి, బాదుడే బాదుడు, ప్రస్తుతం మినీ మేనిఫెస్టోతో ప్రతి ఇంటికి వెళ్లామన్నారు. 2024లో భూపేష్‌రెడ్డిని ఎమ్మెల్యేగా, చంద్రబాబును సీఎంగా చేసుకుంటే జమ్మలమడుగు, రాష్ట్రం బాగుపడుతుందని ఆయన తెలిపారు. టిడిపి అధికారంలోకి రాగానే నాగలకట్ట ప్రజలకు మరింత అందుబాటులో ఉండి, అన్ని సంక్షేమ పథకాలు ప్రతిఇంటికి చేరవేయడంలో భూపేష్‌రెడ్డి సూచనల మేరకు ముందుకు వెళ్తానన్నారు.



కళాకారులకు సూచనలిస్తున్న మహేష్, హేమారెడ్డి

ఒక్క ఛాన్స్ కామెడీ షో అడిషన్స్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని శిల్పారామంలో ఆదివారం కళాకారుల కలలను నిరూపించుకునేందుకు ఒక్క ఛాన్స్ కామెడీ షో అడిషన్స్ కార్యక్రమాన్ని మా ఊరి సినిమా హీరో మహేష్, ఏపీ జీరో ఫోర్ రామాపురం సినిమా డైరెక్టర్ హేమారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ షోకు పలు జిల్లాల నుండి దాదాపు 300 మంది కళాకారులు విచ్చేశారు. న్యాయ నిర్ణేతలుగా మహేష్, వేమారెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్క రూపాయి డబ్బు ఖర్చు కాకుండా, ఎలాంటి సిఫారస్ లేకుండా ప్రతిభగల కళాకారులను బయటికి తీసుకురావాలన్నదే ఈ ఒక్క ఛాన్స్ ముఖ్య ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో మా ఊరి సినిమా టీమ్ మెంబర్స్ మాచిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పటాన్, రాఘవేంద్రారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రమేష్, రాజు, మురళి పాల్గొన్నారు.



కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు

బలిజ సంఘం అభివృద్ధికి కృషి చేద్దాం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల బలిజ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనం కార్యక్రమం బ్రాహ్మణపల్లి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న కల్యాణమండపంలో బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున బలిజ సంఘ నాయకులు విచ్చేశారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో బలిజల కార్యచరణ, సంఘం అభివృద్ధి, వనరులు తదితర అంశాలపై, పిల్లల చదువులు, ఉద్యోగ తదితర విషయాలపై చర్చించారు. ఎవరి శక్తి మేర వారు సంఘ అభివృద్ధికి తోడ్పాలని తీర్మానించారు. ప్రతినెల ఏదో ఒక తేదీన ఇలా కలిసి సమావేశం ఏర్పాటు చేసుకొని యోగక్షేమాలను తెలుసుకోవాలన్నారు.



వనభోజన కార్యక్రమంలో యాదవులు

యాదవ యూత్ ఆధ్వర్యంలో..

పులివెందుల టౌన్ : యాదవ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మండలంలోని గుండాలయ్య కోన వద్ద కార్తీక వనభోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున యాదవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో యాదవుల కార్యచరణ, యాదవ సంఘం అభివృద్ధి, వనరులు వంటి అంశాలు, యాదవుల పిల్లలకు సంబంధించిన విద్యావనరులు, ఉద్యోగ తదితర విషయాలపై చర్చించారు.

గురజాలలో తిరుణాల

సింహాద్రిపురం : మండలంలోని గురజాల సమీపంలో వెలసిన గురుకుంట ఆలయ సముదాయంలో తిరుణాల నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ప్రతి సంవత్సరం చివరి కార్తీక సోమవారం రోజున తిరుణాల జరగడం ఆనవాయితీ. ఇక్కడ వెలసిన అభయాంజనేయ స్వామి, శివాలయాన్ని ప్రత్యేక అలంకరణగా తీర్చిదిద్దారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పులివెందుల డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సులు ఏర్పాటు చేశారు.

కెసి కెనాల్‌లో నిలిచిన నీరు

మరోసారి విడుదల చేయాలని కోరుతున్న ఆయకట్టు రైతులు

ప్రజాశక్తి - చాపాడు



కెసి కెనాల్‌కు అధికారులు సాగునీటిని నిలుపుదల చేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ఖరీఫ్ సీజన్‌లో కెసి కెనాల్‌కు ఈ ఏడాది సకాలంలో నీరు విడుదల కాలేదు. ఈ నేపథ్యంలో వరి పంట సాగు కాలేదు. దీంతో రైతులు రబీ సీజన్‌లో ఆరుతడి పంటలు మినుము, జొన్న సాగు చేపట్టారు. రైతుల సూచన మేరకు ఆరుతడి పంటలకు 20 రోజులపాటు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం కాలువకు నీటిని నిలుపుదల చేశారు. అయితే పసుపు, ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులకు ఈ నెల చివరిలో మళ్లీ నీరు విడుదల చేయాల్సి ఉంది. విడతలవారీగా నీటిని విడుదల చేసినా ఇబ్బంది ఉండదని రైతులు పేర్కొంటున్నారు. కెసి కెనాల్ పరిధిలో దువ్వూరు, మైదుకూరు, చాపాడు, ఖాజీపేట, రాజుపాలెం, చెన్నూరు, వల్లూరు మండలాల పరిధిలో రైతులు ఆరుతడి పంటలను సుమారుగా 65 వేల ఎకరాల్లో సాగు చేపట్టారు. ఖరీఫ్ సీజన్‌లో 15వేల ఎకరాల్లో వరి, పసుపు ఇతర పంటలు సాగు చేశారు. ప్రస్తుతం వరి పంట నూర్పిడి దశలో ఉంది. ఆరుతడి పంటలకు రెండు విడతలుగా నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న రైతు సేవా సమితి నాయకులు

ప్రజాశక్తి - చాపాడు

ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతిన్న వివిధ రకాల పంటల రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఎవి రమణ కోరారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవ సందర్భంగా రైతు సేవా సమితి నియోజకవర్గ సభ్యులతో కలిసి మైదుకూరు పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎవి రమణ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు పడక పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయినప్పటికీ, కరువు జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకోలేదన్నారు. గత వారంలో మిచౌంగ్ తుపాను వల్ల కోత దశకు వచ్చిన పంటలు నీట మునిగి నష్టపోతే రైతుల పంట పొలాల పరిశీలనకు ఇంతవరకు అధికారులు రాకపోవడం దారుణమన్నారు. జిల్లా రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు కూడా ఆదుకునేందుకు ముందుకు రాకపోవడం చాలా అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు పంటలను ఒక సీజన్ పండించకపోతే తిండి గింజల ధరలు, కూరగాయల, ఆకుకూరల ధరలు పెరిగి ప్రతి ఒక్కరిపై ప్రభావం పడుతుందన్నారు. ప్రభుత్వాలు వెంటనే రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా సమితి మైదుకూరు నియోజకవర్గ అధ్యక్షులు రామాంజనేయులు, పట్టణ అధ్యక్షులు రామ్మోహన్, ఖాజీపేట మండల శాఖ అధ్యక్షులు లక్ష్మయ్య, కత్తి నాగిరెడ్డి పాల్గొన్నారు.

లెక్క తప్పితే బతుకు బస్టాండే..!

మట్కా మహమ్మారి మాయలో పడుతున్న పేద కుటుంబాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

లక్కు ఉంటే కాసులు.. లేకపోతే బతుకు బస్టాండ్.. మట్కా మాయలో పడుతున్న పేద కుటుంబాలు. సహజంగా సమాజంలో ప్రతి ఒక్క సామాన్యుడికి లక్షాధికారి కావాలనే లక్ష్యం ఉంటుంది. కొందరు కొన్నికొన్ని మార్గాలను ఎంచుకుని సంపదే ధ్యేయంగా పనులు చేసుకుంటారు. మరి కొందరు అతి తక్కువ సమయంలోనే కోటీశ్వరులు కావాలనే ఉద్దేశంతో తప్పుడు మార్గాలను వెతుక్కుంటారు. అప్పులపాలవుతుంటారు. అలాంటిదే మట్కా మహమ్మారి. ఇందులో బాగుపడినవారికంటే ఆర్థికంగా చితికిపోయినవారే ఎక్కువ. పట్టణం, గ్రామాలు అనే తేడా లేకుండా బీటర్లు మట్కా రాస్తూ సామాన్య ప్రజలను మోసం చేస్తున్నారు. మట్కా బీటర్లు మాత్రం తమ జేబులు నింపుకుంటున్నారు. ఇలాంటి వారిపై పోలీసులు దాడి చేసి కేసులు నమోదు చేసినా మార్పు రాలేదు. ముఖ్యంగా తోపుడు బండ్ల వ్యాపారులు, చిన్నచిన్న వ్యాపారులు, కూలీలు, పలు వృత్తులవారు అధికంగా మట్కాకు ప్రభావితం అవుతున్నారు. పొద్దున్నుంచి సాయంత్రం వరకు కష్టపడిన డబ్బులు తగలేస్తున్నారు. అప్పులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నారు. పోలీసులు మట్కా స్థావరాలపై దాడి చేస్తుండంతో.. ఆ స్థావరాలను మూసేసి తమ దూతలను మట్కా రాసే వారి దగ్గరికి పంపుతూ వ్యవహారాన్ని నడుపుతున్నారు. అంతేకాకుండా కూల్ డ్రింక్స్, టీ దుకాణాల్లో కూర్చుని రాస్తున్న వైనం పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. వీరి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్థిల్లుతోందని పలువురు పేర్కొంటున్నారు.

మట్కాపై పోలీసులు ప్రత్యేకంగా నిఘా పెట్టాలి

మట్కా మహమ్మారిని రూపుమాపాలంటే పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాలి. నిజాయితీ పోలీసులతో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. మట్కా నిర్వాహకులకు, బీటర్లకు, ఆడేవారికి కౌన్సెలింగ్ నిర్వహించి మట్కా వల్ల జరిగే నష్టాలను వివరించాలి. ఆ దిశగా పోలీసులు చర్యలు తీసుకొని మట్కా నుంచి పేదలను రక్షించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

స్వేచ్ఛ, సమానత్వమే మానవ హక్కుల ధ్యేయం

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రపంచంలో ఉన్న ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం అనేది ఉండడమే మానవ హక్కుల ధ్యేయమని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రామసుబ్బయ్య అన్నారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఎన్ఎస్ఎస్ యూనిట్-8 ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు మానవ హక్కులపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామసుబ్బయ్య మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 1948లో యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్‌ను (యూడీహెచ్ఆర్) ఆమోదించినట్లు చెప్పారు. ప్రతి ఎడాది డిసెంబర్ 10న ప్రపంచ మానవ హక్కుల దినంగా పాటిస్తున్నట్లు తెలిపారు. 1994 నుంచి దేశంలో మానవ హక్కుల పరిరక్షణ చట్టం అమలులో ఉందన్నారు. దీన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మానవ హక్కులపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ మధుసూదన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అనూష రాజ్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవకాశమిస్తే అభివృద్ధి పథంలో నడిపిస్తా



మాట్లాడుతున్న జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు ఎమ్మెల్యేగా తనకు ఒక అవకాశం ఇస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తానని టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ప్రజల్ని కోరారు. స్థానిక 41వ వార్డులో ఆదివారం శూలం లక్ష్మీదేవి, శూలం శివప్రసాద్, శూలం మురళి, శూలం చంద్రశేఖర్‌లకు ప్రవీణ్‌రెడ్డి టిడిపి కండువా కప్పి సాదరంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ 41వ వార్డు శూలం ప్రసాద్, శూలం లక్ష్మీదేవి వారి అనుచరుల చేరికతో పార్టీ బలోపేతం అవుతుందన్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్ స్వతంత్ర అభ్యర్థిగా శూలం లక్ష్మీదేవి స్వల్ప ఓట్ల తేడాతో ఓడినా, అది గెలుపే అన్నారు. టిడిపి బలోపేతానికి ఇది మొదటి మెట్టని ప్రవీణ్ తెలిపారు. ఎమ్మెల్యేగా రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులు దోచుకోవడం తప్ప అభివృద్ధి చేసిందేమీ లేదని విమర్శించారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే రాచమల్లు ఎన్నో హామీలిచ్చి అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి విఎస్ ముక్తియార్,పట్టణ అధ్యక్షులు ఇవి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, టిడిపి నాయకులు ఆవుల దస్తగిరయ్య, పాణ్యం సుబ్బరాయుడు, కోట శ్రీదేవి, తాటి శ్రీనివాస యాదవ్, రాజుపాలెం మండలశాఖ అధ్యక్షులు విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

ముంపు గ్రామంగా పరిగణించాలి

ప్రజాశక్తి - కొండాపురం



ఎంపీని కలిసిన వైసిపి నాయకులు

మండలంలోని కె. సుగుమంచిపల్లె గ్రామాన్ని పూర్తిగా ముంపు గ్రామంగా పరిగణించాలని తె గ్రామ వైసిపి నాయకులు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని కోరారు. గతంలో సుగుమంచిపల్లె గ్రామాన్ని కొంత భాగాం మాత్రమే ముంపునకు తీసుకున్నారని, గత ఏడాది ప్రాజెక్టులో నీరు ఉంచడం వల్ల మిగిలినవారి ఇళ్లలోకి నీటి ఊటలు పెరిగాయన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామాన్ని పూర్తిగా ముంపునకు తీసుకోని పరిహారం చెల్లించాలని గ్రామ నాయకులు నాగు ఆదినారాయణరెడ్డి, నాగు అనిమిరెడ్డి, సి ఆదినారాయణరెడ్డి కోరారు. దీనిపై ఎంపీ స్పందిస్తూ ఇప్పటికే అధికారులతో మాట్లాడామని, త్వరలో మీ గ్రామానికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

సమస్యలను పరిష్కరిస్తాం

పులివెందుల రూరల్ : పులివెందులలోని అంకాలమ్మ పేట సచివాలయం పరిధిలో ఉన్న బాలికల వసతి గృహాన్ని ఆదివారం మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బాలికలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. సమస్యల గురించి తెలుసుకున్నారు. వసతిగృహంలో ఇన్వర్టర్ లేదని విద్యార్థినులు చెప్పగా.. వెంటనే స్పందించి ఇన్వర్టర్ పెట్టించే ఏర్పాటు చేస్తానని ఛైర్మన్ తెలిపారు. ఇప్పటి నుంచే ప్రణలికాబద్ధంగా చదువుకోవాలని, అందుకు అవసరమైన యుపిఎస్‌సి, నీట్ పుస్తకాలు వసతిగృహానికి అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కౌన్సిలర్ కొండలరావు, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ బాల నారాయణ, సూపరింటెండెంట్ ఆనందరావు, శ్రీధర్, ప్రశాంతి పాల్గొన్నారు

కష్టపడితేనే గుర్తింపు



చంద్రబాబును కలిసిన టిడిపి నాయకులు

వేంపల్లె : రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కోసం పని చేయండి.. మంచి గుర్తింపు ఉంటుందని టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో ఉన్న చంద్రబాబును పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక శ్రీరాం నగర్‌కు చెందిన బత్తాల రమణ, భాస్కర్ కలిశారు. గతంలో పని చేసిన విధంగానే టిడిపికి కష్టపడి పని చేయాలని చంద్రబాబు చెప్పినట్లు పార్టీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి చెప్పారు. పులివెందులలో బిటెక్ రవి గెలుపునకు పని చేయాలని చంద్రబాబు కోరినట్లు తెలిపారు. రాబోయేది టిడిపి ప్రభుత్వమేనని ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో రామమునిరెడ్డి, టిడిపి నాయకుడు కత్తులూరు మల్లికార్జున పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సచివాలయాల ద్వారా అర్హులకు పథకాలు

ప్రజాశక్తి - మైలవరం

సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పెద్దకొమెర్ల గ్రామంలో ఆదివారం నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్, అంగన్‌వాడీ సెంటర్, మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. అలాగే రూ.70 లక్షలతో సిసి రోడ్లు, గ్రావెల్ రోడ్లు వేశా మన్నారు. నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలకు రూ.14 లక్షలతో అభివృద్ధి చేశామన్నారు. గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని అది జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమని, రాబోయే కాలంలో మంచి పాలన అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు సావిత్రమ్మ, సర్పంచ్ రామసుబ్బమ్మ, చరిత బిల్డర్స్ అధినేత చెన్నకేశవరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ శివ గురివిరెడ్డి, దోడియం విష్ణువర్ధన్‌రెడ్డి, చిన్నయ్య రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రెడ్డి సంఘం నాయకులు

విభిన్నప్రతిభావంతులకు దుప్పట్లు వితరణ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

అంతర్జాతీయ విభిన్నప్రతిభావంతుల వారోత్సవాల్లో భాగంగా మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ముద్దనూరు రోడ్డులోని విభిన్నప్రతిభావంతుల కమ్యూనిటీ భవనంలో రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాలు గంగాధర్‌రెడ్డి, గ్రూప్ టెంపుల్స్ ఛైర్మన్ చింతకుంట సుదీకర్‌రెడ్డి, ఒతూరు రసూల్ విభిన్న ప్రతిభావంతుల స్ఫూర్తిప్రదాతల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ వారు సమకూర్చిన దుప్పట్లు 30మందికి అందజేశారు. కార్యక్రమంలో విభిన్నప్రతిభావంతుల నెట్‌వర్క్ అధ్యక్షులు రఘునాథరెడ్డి, ఆర్‌సిడిఎస్ కార్యవర్గ సభ్యులు చప్పిడి కృష్ణారెడ్డి, రెడ్డి యూత్ నాయకులు ప్రదీప్‌రెడ్డి, శివమోహన్‌రెడ్డి, మహేంద్రరెడ్డి, హరీష్‌రెడ్డి, నెట్‌వర్క్ సభ్యులు వెంకట సుబ్బయ్య, గంగయ్య, మహేశ్వర్‌రెడ్డి, సిద్ధారెడ్డి, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఎంపీ అవినాష్‌రెడ్డి రాక

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని పలు అభివృద్ధి పనులకు కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి సోమవారం ప్రారంభించనున్నట్లు వైసిపి మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి బియన్ బ్రహ్మానందరెడ్డి, తహశీల్దార్ మహబూబ్ బాషా తెలిపారు. ఆ మేరకు ఆదివారం వారు మాట్లాడుతూ మండలంలోని బలపనూరు, అంకాలమ్మ గూడూరు, లోమడ గ్రామంలో దాదాపు రూ.10 కోట్ల వ్యయంతో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, వైయస్సార్ హెల్త్ క్లినిక్ ప్రారంభించనున్నట్లు వివరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు తప్పక హాజరుకావాలని పిలుపునిచ్చారు.

పరిహారం కోసం పేర్లు నమోదు చేసుకోవాలి

చాపాడు : గత వారంలో మిచౌంగ్ తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటల నష్టపరిహారం పొందేందుకు రైతులు పేర్లను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మ్యాగీ తెలిపారు. వర్షం కారణంతో ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన వరి పంట నేల కొరిగిందన్నారు. ఎడిఎ, మండల అధికారులు, ఎంపిపితో కలిసి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ప్రాథమిక అంచనా ప్రకారం 1500 ఎకరాల వరి పంట నేలకొరిగినట్లు ఉన్నతాధికారులకు నివేదికను గత వారంలో పంపామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సోమవారం రైతుల వివరాలను ఆధారాలతో సేకరించి పంపాలని ఆదేశించారన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ చంద్రశేఖర్

ఫాతిమా మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో

కుటుంబ ప్రాథమిక ఆరోగ్య దత్తత స్వీకారోత్సవం

ప్రజాశక్తి - కడప

ఫాతిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వారి ఆధ్వర్యంలో ఆదివారం తాడిగుంట్ల గ్రామంలో కుటుంబ ప్రాథమిక ఆరోగ్య దత్తత స్వీకారోత్సవం, వైద్య శిబిరాన్ని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జవాద్ ఎ.క్యూ, ఎఫ్ఐఎంఎస్ ఈడి సల్మాన్ సమక్షంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి తాడిగుంట్ల ఓబుల రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి సహకరించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ శైల రేఖ, డైరెక్టర్, మెడికల్ సూపరింటెండెంట్, వైస్ ప్రిన్సిపల్, కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, కళాశాల పీజీ, మెడికల్ విద్యార్థులు, ఉచిత మెడికల్ క్యాంపులో 250 మంది వైద్య సేవలు చేయించుకున్నారు.

11 మందికి కంటి ఆపరేషన్లు

ప్రజాశక్తి - రాయచోటి

మండల పరిధిలోని చెన్నముక్కపల్లిలో ఉన్న లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 11 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు నియోజక వర్గంలోని కెవి పల్లె, యర్రావారిపాలెం, కలకడ, కలికిరి, గుర్రంకొండ, పెద్దమండెం, సత్యసాయి జిల్లాలోని కదిరి తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 30 మంది కంటి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి కంటి వైద్యులు అందులో 11 మందికి ఆపరేషన్లు చేశారు. గతంలో ఆపరేషన్ చేయిం చుకున్న 40 మంది కంటి రోగులకు ఉచితంగా అద్దాలు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ లయన్ చెన్నూరు బాష కంటి వైద్యులు సురేష్ బాబు,ఆఫ్టాలిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది, పాల్గొన్నారు.